సంపుటి: 4 | సంచిక: 3

మార్చి - ఏప్రియల్, 2016

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



యేసుక్రీస్తు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది.



# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

మీరు మీ కుటుంబములు దేవుని కృపలో జీవించాలని కోరుచున్నాను. ఈ సంవత్సరము మొదటి రెండు నెలలు మనలను కాపాడి మూడవ నెలలో ప్రవేశపెట్టిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించ వలసినవారమైయున్నాము. చదువుకుంటున్న పిల్లలందరికి ఎగ్జామ్స్ ప్రారంభమై కొందరు ఎగ్జామ్స్ వ్రాస్తూ ఉండగా మరికొందరు ఎగ్జామ్స్ కొరకు సిద్ధపడుతూ ఉన్నారు. వీరందరికి ప్రభువు జ్ఞానము, జ్ఞాపకశక్తి ఇవ్వమని ప్రార్థన చేయుదము. నేటి యౌవనస్థులు కేవలం చదువులోను ఉద్యోగములలోను కాక దేవునియందలి విశ్వాసములోను బలవంతులు కావలెనని కోరుకొనుచున్నాను. ఎందుకనగా నేడు తోటివారి అవసరతలు గుర్తించలేని విధంగా నిర్లక్ష్యభావము పెరిగిపోయింది. మానవుని పట్ల దేవుని ఉద్దేశ్యం గమనిస్తే నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించమని చెప్పడం జరిగింది దానిలో ఎంత ఆనందం ఉన్నదో అర్థమైతే ప్రతి ఒక్కరు ఆయన మాట ప్రకారం జీవించడం జరుగుతుంది. క్రీస్తుని విశ్వసించిన వారంతా ఈ నెలలో 25వ తేది మంచి శుక్రవారంగా పాటించడం జరుగుతుంది. మంచి శుక్రవారం అనగా యేసుప్రభువు మన అందరి పాపములను తన మీద వేసుకొని వాటికి శిక్షగా సిలువ వేయబడడం. తద్వారా ఆయన మనలను ఎంత ప్రేమిస్తున్నాడో తెలియపరిచినాడు. అంత మాత్రమే కాకుండా మనము ఇతరులను ప్రేమించుటకు ప్రోత్సహించడం జరిగింది.

దేవుడు స్పర్శ పాఠకులైన మనలను తన ఉద్ధేశ్యానుసారముగా నడిపించును గాక!

మీ సహోదరుడు.....

సంపుటి: 4 | సంచిక: 3 మార్చి - ఏప్రిల్, 2016

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- సరియైన క్రమము ........ 2
- అవతలి వారి పట్ల శ్రద్ధ కనపరచండి ........ 5
- స్త్రీ ప్రాముఖ్యత (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 45వ భాగము ........ 9
- ఆల్ ది బెస్ట్ (బాలల శీర్షిక) ........ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 13
- పవిత్ర రక్తము ద్వారా... ........ 15
- సులభమైన ప్రార్థనా శక్తి ........ 18
- బహుమానం (Gift) ........ 20
- బైబిల్ క్విజ్ - 45 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# సరియైన క్రమము

- బ్రదర్. ఎపఫ్రా

నేడు క్రైస్తవ్యము కేంద్రముగా అనేక బోధలు వినబడుచున్నవి. సంఘములలో, పత్రికలలో మరియు టి.విల ద్వారా ఎన్నడూ లేనంత విరివిగా బోధలు ప్రకటించబడుచున్నవి. ఈ బోధలలో అనేక వైరుధ్యములు స్పష్టముగా మనము గమనించవచ్చు. ఎవరి బోధలను ప్రామాణికంగా తీసుకోవాలో తెలియని పరిస్థితులలో సామాన్యమైన ప్రజలు ఉన్నారు. ఈ కన్‌ఫ్యూజన్ వలన కొందరు దేవునికి దూరమైపోతున్నారు. మనము దేవుని సన్నిధికి దూరం కావడం పరిష్కారం కాదు కానీ, దేవుని వాక్యమును చదివి, ధ్యానించి, పరిశుద్ధాత్మ దేవుని ద్వారా సరియైన ఆలోచనలను పొంది, ఆ మార్గములో నడుచుకొనుటయే చేయవలసిన విధి.

### 1. నూతనముగా దేవుని యొద్దకు వచ్చువారు :-

నూతనముగా వచ్చేవారు తమకు తమ కుటుంబములకు అనారోగ్యములో స్వస్థత, ఆర్థిక సమస్యల నుండి విడుదల మరియు మనశ్శాంతి కావాలి అనే వాటి కొరకు కావచ్చు. వీటన్నిటిని దేవుడు అనుగ్రహిస్తాడు అనుటలో ఎటువంటి సందేహము లేదు. అయితే మానవుని ప్రతి బాధకు కారణమైన పాపము పరిహరింపబడవలసి యున్నది. మనుష్యులందరి పాపపరిహారార్థమై యేసుక్రీస్తు పాపశిక్షను భరించడం జరిగింది. ఈ సంగతిని ప్రతి ఒక్కరు గ్రహించుటయే నిజమైన రక్షణ. ఉదాహరణకు ఒక గ్రామం మధ్యలో మురుగు గొయ్యి ఒకటి ఉంది, దాని నుండి వెలువడే దుర్వాసన వలన ఎంతో మంది ఇబ్బంది పడుతుండేవారు. ఆ మురుగు వలన దినదినము దోమలు విస్తరిస్తూ ఉండేవి. వాటి బారిన పడి ఎంతో మంది అనారోగ్యము పాలవుతుండేవారు. వీటన్నిటికి పరిష్కారంగా గ్రామ పెద్దలు దుర్వాసన రాకుండా, దోమలు విస్తరించకుండా మెడిసిన్ స్ప్రే చేశారు. కొన్ని రోజులు బాగానే ఉన్నా, మరల అవే సమస్యలు. వాటి నుండి శాశ్వతమైన పరిష్కారం ఆ మురుగు గుంట అక్కడ లేకుండా చేయడం. అదే విధముగా సమస్త బాధలకు కారణమైన పాపమును మానవ హృదయములో నుండి తీసివేయుటకు యేసుక్రీస్తును విశ్వసించుటయే నిజమైన పరిష్కారం. దానికి బలమైన ఆధారము బైబిల్ గ్రంథములో చెప్పబడింది.

**వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని - సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడుగగా । పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు. ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారికందరికిని చెందునని వారితో చెప్పెను. ఇంకను అనేక విధములైన మాటలతో సాక్ష్యమిచ్చి**

 **మానవుడు ఎంత గొప్పవాడైతే, అంత కఠినమైన పరీక్షలను దాటవలసి ఉంటుంది.**



**- మీరు మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందుడని వారిని హెచ్చరించెను । కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి, ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి. - (అ.పో. కా॥2:37-41)**

నూతనముగా దేవుని యొద్దకు వచ్చిన వారికి అవసరమైన విషయము పాడైపోయిన హృదయమును యేసుక్రీస్తు బాగు చేస్తాడని విశ్వసించడం. నేటి దినములలో అనేకమంది బోధకులు వారి బోధలలో ఈ విషయమును ప్రస్తావించకపోవడం దారుణమైన విషయము. జనరంజకంగా ఉండుటకు తప్ప శాశ్వత ప్రయోజనముల కొరకు మాట్లాడుట లేదు. ఎంత గొప్ప బోధకులైనా వారి బోధలకు ప్రామాణికం బైబిల్ గ్రంథమే కానీ మరే ఇతర సంగతులు కాదు. ప్రజల ఆమోదం ఉందని దైవవాక్యమునకు వ్యతిరేకమైన బోధలు చేయటం సమర్ధనీయం కాదు.

**2 నూతన విశ్వాసులు :-**

విశ్వసించి బాప్తిస్మము ద్వారా క్రొత్త జన్మ అనుభవములోనికి వచ్చిన ప్రతి ఒక్కరు దేవుడు వారికి ఇచ్చిన సంఘములో శ్రద్ధగా వాక్యమును వినుచు, విశ్వాసములో ఎదగవలెను. ఇదే విషయాన్ని పౌలు తిమోతికి వ్రాసిన పత్రికలో ఈలాగు చెప్పియున్నాడు. **ఈ సంగతులను సహోదరులకు వివరించిన యెడల నీవు అనుసరించుచూ వచ్చిన విశ్వాస సుబోధ సంబంధమైన వాక్యములచేత పెంపారుచూ క్రీస్తు యేసునకు మంచి పరిచారకుడవై యుందువు. అపవిత్రములైన ముసలమ్మ ముచ్చట్లను విసర్జించి, దేవ భక్తి విషయములో నీకు నీవే సాధకము చేసికొనుము. శరీర సంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజనకరమవును కాని దైవ భక్తి ఇప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవును (1తిమోతి 4:6-8).** విశ్వసించిన వారిని దేవుని వాక్యము ద్వారా పెంచాలనే శ్రద్ధ అనేక మంది క్రైస్తవ నాయకులలో కనిపించుట లేదు. కేవలం వారి సంఘ అభివృద్ధి కొరకు ఎలా ఉపయోగించుకోవాలా అనే దురాశ మాత్రమే కనబడుచున్నది. దేవుని రాజ్య వ్యాప్తి కంటే సొంత సామ్రాజ్యములను స్థాపించుటలో తీరిక లేకుండా పరిగెత్తుచున్నారు. రక్షించబడిన వారు పెద్దలకు లోబడి, తమ్మును తాము తగ్గించుకొని, షరతులు లేని ప్రేమ చూపుటలో, క్షమించుటలో ఎదగవలయును. తాను వెళ్ళుచున్న దేవుని సంఘములో ఒక అవయవము వలె మిగిలిన వారందరితో పని చేయవలెను. తన రాబడి అంతటిలో దేవుని భాగమైన దశమ భాగమును నమ్మకముగా దేవుని మందిరములో ఇవ్వవలయును. నేడు ఇలాగున క్రమమైన పద్ధతిలో ఎదుగుచున్నవారు ఎంత మంది? అనేక సంఘములలో ఆత్మీయ క్రమశిక్షణ కనిపించుట లేదు. వారు ఏ వారం ఏ మందిరమునకు

వెళ్ళుదురో, వెళ్ళకపోవుదురో తెలియదు. ఇది ఎంతో భ్రష్టత్వము. కొందరు దశమ భాగములతో బీదలకు, అనాధలకు సహాయం చేస్తూ, మరికొందరు టి.వి ప్రోగ్రామ్స్ స్పాన్సర్ చేస్తూ, తమ మనస్సాక్షిని మోసగించుకొనుచున్నారు. ఇట్టివి వాక్యమునకు విరుద్ధము. నూతనముగా విశ్వసించినవారు సరియైన సంఘములో, వాక్యానుసారమైన బోధలలో ఎదుగుచుండవలెను.

**3. విశ్వాసములో కొనసాగుచున్నవారు:-**

దేవుని విశ్వసించి కొన్ని సంవత్సరములుగా ముందుకు వెళ్ళుచున్నవారు తమ బాధ్యతలు ప్రక్కన పెట్టి, విశ్లేషణలు చేస్తూ వాళ్ళ వాక్యము ఇలా ఉంది, వీళ్ళ వాక్యము అలా ఉంది అని అనుకుంటూ పూర్తిగా నేర్చుకొనుటకు దూరమైపోతున్నట్లు ఉన్నారు. ఇదే విషయాన్ని పౌలు **2 తిమోతి 2:14లో ఈలాగు చెప్పాడు. వినువారిని చెరుపుటకే గాని మరి దేనికిని పనికిరాని మాటలను గూర్చి వాదము పెట్టుకొనవద్దని, ప్రభువు ఎదుట వారికి సాక్ష్యమిచ్చుచు ఈ సంగతులను వారికి జ్ఞాపకము చేయుము.** కొన్ని విషయములు మనకు తెలిసినంత మాత్రమున మనము గొప్పవారమని, మనలను అందరూ గౌరవించాలని, సంఘములో ఏదో విధంగా గుర్తింపు కావాలని ప్రాకులాడటం మంచిది కాదు. పాటలు పాడాలని, వాక్యమును చెప్పాలని అవకాశముల కొరకు తిరుగుచూ, మన పైన ఉన్న నాయకత్వమును ఎదిరించుట ఎంతో ఆందోళనకరము. పైన ఉన్న అధికారమును ఎదిరించువారు దేవుని ఎదిరించుచున్నారు అను మాటను బట్టి నాశనమే వారి అంతము. ఇట్టివాటికి మనము దూరముగా ఉందుము గాక! మనం ఎంత గొప్ప స్థాయికి వెళ్ళిననూ ప్రతివారికి ఏ విధంగా ఉపయోగపడగలమా అనే ఉపకారబుద్ధి కలిగి జీవించవలయును. అంతే కాని ఎదుటి వారి నుండి ఏదియూ ఆశించకూడదు. అనేకులకు ప్రకటించి నేను భ్రష్టుడనైపోవుదునేమోనని నన్ను నేనును, నా శరీరమును నలగగొట్టుకొనుచున్నానని అపో.పౌలు చెప్పడం జరిగింది. నిజముగా దేవునిలో కొన్ని సంవత్సరములుగా విశ్వాసమును కాపాడుకొనుచు కొనసాగుతున్న వారు వెనక వచ్చుచున్న వారికి అన్ని విషయములలో మాదిరి కనపరచుచుండవలయును.

ప్రియమైన దేవుని స్పర్శ పాఠకులైన మీరు వాక్యమునకు వ్యతిరేకమైన బోధలలో పడి కొట్టుకొనిపోకుండా లేక సాతాను నేర్పించిన స్వనీతి బోధలలో జీవించకుండా ప్రతి ఒక్కరు, ఎవరి స్థాయిలో వారు బైబిల్ గ్రంథములోని దేవుని వాక్యానుసారమైన బోధలో నిలిచి ఉండాలని హృదయపూర్వకంగా కోరుకొనుచున్నాను.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక!

# అవతలి వారి పట్ల శ్రద్ధ కనపరచండి

12 సం॥ల పిల్లవాడు సరియైన బట్టలు లేకుండా, అమాయకంగా, చింపిరి జుట్టుతో, పరిగెత్తుకుంటూ ఐస్‌క్రీం పార్లర్‌కి వెళ్లాడు. ఆ పిల్లవానికి కోన్ ఐస్‌క్రీం అంటే చాలా ఇష్టం. టేబుల్ ముందు కూర్చుని, సర్వర్‌ని కోన్ ఐస్‌క్రీం ధర ఎంత? అని అడిగాడు. 25 రూ॥లు అని జవాబు వచ్చింది. తన చేతిలోని చిల్లరని లెక్కపెట్టుకొని, ఆ పిల్లవాడు ఒక చిన్న కప్ ఐస్‌క్రీం వెల ఎంత? అని అడిగాడు. సర్వర్ సమాధానం చెప్పడానికి చిరాగ్గా ముఖం పెట్టి, విసుగుతో 20రూ॥లు అని చెప్పాడు. నేను కప్ ఐస్‌క్రీం తీసుకుంటాను అన్నాడు పిల్లవాడు. ఆ ఐస్‌క్రీం తిని, బిల్లు చెల్లించి వెళ్లిపోయాడు. ఖాళీ ప్లేట్ తీయడానికి ఆ టేబుల్ దగ్గరకు వచ్చిన సర్వర్ మనసు చలించిపోయింది. ఆ ప్లేట్ క్రింద 5 రూ. పెట్టి వెళ్ళాడు ఆ చిన్నపిల్లవాడు.

ఆ చిన్నవాడు తనకి ఐస్‌క్రీం తెప్పించుకునే ముందు సర్వర్‌ని కూడా దృష్టిలో ఉంచుకున్నాడు. సున్నిత మనస్తత్వముతో, అవతలి వ్యక్తి అవసరతలను గమనించే స్వభావమును కనపరిచాడు. తనని గురించి ఆలోచించే ముందు ఇతరుల గురించి ఆలోచించాడు.

చూశారా! ఆ పిల్లవాడి దగ్గర ఉన్న డబ్బు 25 రూ॥లు . ఆ డబ్బుతో కోన్ ఐస్‌క్రీం వస్తుంది. కానీ సర్వ్ చేసే వ్యక్తి గురించి ఆలోచించి, కోరికను నియంత్రించుకొని, కప్ ఐస్‌క్రీం తీసుకొని 5 రూ॥లు అతనికి ఇచ్చాడు. ఎంత మంచి మనస్సు ఎదుటి వారి పట్ల శ్రద్ధ కనుపరిచే మనస్సు.



# స్త్రీ ప్రాముఖ్యత

సిస్టర్. వి. విజయ

స్త్రీలు విలువైనవారు, స్త్రీ పాత్ర సమాజములోను, కుటుంబములోను ఎంతో ప్రాముఖ్యమైనది. ఎన్ని బాధలున్ననూ, సమస్యలున్ననూ ప్రత్యేకమైనది. కుటుంబములో స్త్రీలు ఎప్పుడూ భర్త, పిల్లల కోసం తమ్మును తాము త్యాగం చేసుకుంటూ, క్రొవ్వొత్తి వలె కరిగిపోతూ ఆరోగ్యములను కూడా నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. ఆరోగ్యములను జాగ్రత్తగా చూచుకుంటూ, కుటుంబములను జ్ఞానముతో కట్టుకోవాలి. జ్ఞానము అనేది పుడుతూనే రాదు, పెరుగుచూ ఉన్నప్పుడు, మందిరమునకు వెళ్ళుచూ, చెప్పబడిన విషయములను వింటూ, అక్కడ నేర్చుకొనుట ద్వారా జ్ఞానముతో మన కుటుంబమును కట్టుకోగలము.

లోకములోని స్త్రీల కంటే మనం భిన్నంగా ఉండాలి. ఎందుకనగా సజీవుడైన దేవుని ఆశ్రయముగా చేసుకున్నాము. ఆయనను రక్షకునిగా అంగీకరించి, దేవుని యందలి భయము కలిగి ప్రవర్తించుచూ, దేవుని వాక్యము చేత శక్తితో నింపబడుచూ, మన సమస్యలను మనం పరిష్కరించుకుంటూ, సమస్యలతో సతమతమవుతూ కన్నీటితో ఉన్న స్త్రీలను ధైర్యపరచాలి, పైకి లేవనెత్తాలి.

దేవుడు సృష్టి అంతటిని నోటి మాట చేత సృజించి, ఆయన పోలిక చొప్పున, ఆయన స్వరూపములో మనిషిని సృజించారు. ఆదాము ఒక్కడి వలన ఈ సృష్టి సంపూర్తి కాదు అని, సాటియైన సహాయమును చేయాలని ఆదాముకి గాఢనిద్రను కలుగజేసి, ప్రక్కటెముకను తీసి స్త్రీగా చేశారు.

దేవుని యొక్క అద్భుతమైన అమూల్యమైన సృష్టి స్త్రీ. దేవుడు స్త్రీని సృజించిన తరువాత మంచిది అనే చూశారు. పక్షపాతం లేకుండా ఇరువురిని ఫలించి, అభివృద్ధి చెంది, భూమిని నిండించమని చెప్పారు. **దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా - మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను. దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాల మంచిదిగా ఉండెను. అస్తమయమును ఉదయమును కలుగగా ఆరవదినమాయెను. - ఆది 1:27,28,31**

స్త్రీ యొక్క ప్రభావము తప్పక కుటుంబము మీదా, సమాజము మీదా, సంఘములో కూడా ఉంటుంది. దేవుడు స్త్రీలను ఎంతో ప్రేమిస్తున్నారు, పక్షపాతం లేదు, గొప్ప ప్రణాళికను కలిగి ఉన్నారు. పురుషులలో లేని ఎన్నో మంచి సుగుణములను దేవుడు

స్త్రీలకు అనుగ్రహించారు. ఓర్పుతో, సహనముతో, నమ్మకమైన, కష్టపడే పనివారిగా ఉంటారు. కృతజ్ఞతా భావం కూడా అధికంగా ఉంటుంది. ప్రార్థించే వారిగా, ప్రేమించే వారిగా ఉంటారు. అయితే అసూయ కూడా అదే విధంగా ఉంటుంది. కానీ అసూయని దేవుని వాక్యం ద్వారా జయించేవారమై ఉండాలి.

యేసుప్రభువు శరీరధారియైయున్న దినములలో స్త్రీలను ఆదరించి, ధైర్యపరిచారు. కృంగిన స్థితిలో పైకి లేవనెత్తారు. అనారోగ్యములలో ముట్టి స్వస్థపరిచారు. యేసయ్య యొక్క ప్రేమ స్త్రీల మీద ఎంతో ప్రభావమును చూపింది. అందుకే అనేక మంది స్త్రీలు దేవుని రాజ్య సువార్త కొరకు యేసయ్యతోను తరువాత శిష్యులతోను, పౌలుతోను కలిసి ప్రయాసపడినట్లుగా లేఖనములు చెప్పుచున్నాయి. **వెంటనే ఆయన దేవుని రాజ్యసువార్తను తెలుపుచు, ప్రకటించుచు, ప్రతి పట్టణములోను ప్రతి గ్రామములోను సంచారము చేయుచుండగా పండ్రెండుమంది శిష్యులును, అపవిత్రాత్మలును వ్యాధులును పోగొట్టబడిన కొందరు స్త్రీలును, అనగా ఏడు దయ్యములు వదలిపోయిన మగ్దలేనే అనబడిన మరియయు, హేరోదు యొక్క గృహనిర్వాహకుడగు కూజా భార్యయగు యోహన్నయు, సూసన్నయు ఆయనతోకూడ ఉండిరి. వీరును ఇతరులనేకులును, తమకు కలిగిన ఆస్తితో వారికి ఉపచారము చేయుచు వచ్చిరి. - లూకా 8:1-3**

అంతేకాక సిలువ వేయబడిన తరువాత మూడవ దినమున పునరుత్థానుడైన యేసయ్య యొక్క సువార్తను ప్రకటించే భాగ్యము, అలాగే ఆ పునరుత్థానుడైన యేసయ్యను మొట్టమొదటిగా చూచిన ధన్యత స్త్రీలదే. **సమాధియొద్దనుండి తిరిగి వెళ్లి యీ సంగతులన్నియు పదునొకండుగురు శిష్యులకును తక్కినవారికందరికిని తెలియజేసిరి. ఈ సంగతులు అపోస్తలులతో చెప్పిన వారెవరనగా - మగ్దలేనే మరియయు యోహన్నయు యాకోబు తల్లియైన మరియయు వారితో కూడ ఉన్న యితర స్త్రీలును. - లూకా 24:9,10**

యేసుప్రభువు పరలోకమునకు పునరుత్థానుడైన తరువాత ఆయన చెప్పిన వాగ్దానము కొరకు కనిపెట్టుకున్న శిష్యులతో పాటు కొందరు స్త్రీలు కూడా ఉన్నారు. **వీరందరును, వీరితోకూడ కొందరు స్త్రీలును, యేసు తల్లియైన మరియయు ఆయన సహోదరులును ఏకమనస్సుతో ఎడతెగక ప్రార్థన చేయుచుండిరి. - అ.పొ.కా॥1:14**

అపో.పౌలు చేయుచున్న పరిచర్యలో అకుల, ప్రిస్కిల్లా అను కుటుంబము ఎంతో సహాయకరముగా, అనేకులను దేవుని మార్గములో ప్రోత్సాహపరిచే వారిగా ఉన్నారు, అందుకే పౌలు వారి గురించి ఇచ్చుచున్న సాక్ష్యము ఎంతో అద్భుతమైనది. **క్రీస్తుయేసునందు నా జతపనివారైన ప్రిస్కిల్లకును, అకులకును నా వందనములు చెప్పుడి. వారు నా ప్రాణముకొరకు తమ ప్రాణములను ఇచ్చుటకైనను తెగించిరి. మరియు, వారి యింట ఉన్న సంఘమునకును వందనములు చెప్పుడి; నేను మాత్రము కాదు అన్యజనులలోని**

**సంఘములవారందరు వీరికి కృతజ్ఞులైయున్నారు. – రోమా 16:3,4**

మోషే తల్లియైన యెకెబెదు కుటుంబములో తన బిడ్డల మీద ప్రభావము చూపి దేవునికి ప్రయోజనకరమైన వారిగా తీర్చిదిద్దింది. క్రొత్త నిబంధనా గ్రంథములో అపో.పౌలు తిమోతిలో ఉన్న విశ్వాసమును **(ఆ విశ్వాసము మొదట నీ అవ్వయైన లోయిలోను నీ తల్లియైన యునీకేలోను వసించెను, అది నీయందు సహ వసించుచున్నదని నేను రూఢిగా నమ్ముచున్నాను. – 2 తిమోతి 1:4,5)** మొదట అతని తల్లిలోను, అవ్వలోనూ చూచానని చెప్పడం ఎంతో మంచి మాట.

ఆది సంఘములో మొట్టమొదటి హతసాక్షి అయిన సైఫను యొక్క ఇంటివారు పరిశుద్ధులకు పరిచర్య చేయుటకు తమ్మును తాము అప్పగించుకొని యున్నారని అపో.పౌలు చెప్పుచున్నాడు. **సైఫను ఇంటివారు అకయయొక్క ప్రథమఫలమై యున్నారనియు, వారు పరిశుద్ధులకు పరిచర్య చేయుటకు తమ్మును తాము అప్పగించుకొని యున్నారనియు మీకు తెలియును – 1కొరింథీ 16:15** కుమారుడిని రాళ్ళతో కొట్టి చంపివేసిన తరువాత కూడా వీరు సంఘమునకు (పరిశుద్ధులకు) పరిచర్య చేయుటకు ఏ మాత్రం వెనుకకు వెళ్ళిపోక తమ్ముని తాము తగ్గించుకున్నారు. ఇది మనం చాలా గమనించవలసిన విషయం. అలాగే మనము ఏ విధంగా ఉండాలి, ఎలా ప్రయాసపడాలి ఉండాలి అనే విషయమును కూడా అపో.పౌలు చెప్పుచున్నాడు. **కాబట్టి సహోదరులారా, అట్టివారికిని, పనిలో సహాయము చేయుచు ప్రయాసపడుచు ఉండువారికందరికిని విధేయులై యుండవలెనని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. – 1 కొరింథీ 16:16**

అట్టి వారికి, పనిలో ప్రయాసపడుచున్న వారికి విధేయులై ఉండుట కూడా మన జీవితములలో దేవుని వాక్యమును బట్టి ఎంతో మంచిది. మనలను మనం తగ్గించుకొని, పరిచర్య చేయుట యందు, చేయుచున్న వారికి లోబడి జీవించుట యందు ఆసక్తిని కలిగి దేవుని రాజ్య వ్యాప్తి కొరకు ప్రయాసపడుదాము.

అట్టి కృప దేవుడు మనకు అనుగ్రహించును గాక !


**ఎపఫ్రా మినిస్ట్రీస్ – వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**
**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**
**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**
అందరూ ఆహ్వానితులే....!

వివరములకు:
9666666249 | 040-24202227



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 45వ భాగము**

సుందర్‌సింగ్ గారి ప్రఖ్యాతిని గూర్చి విన్న అనేకమంది ఉత్సుకత వలన ఆయనను చూడాలని, ఆయనతో మాట్లాడాలని ఎంతగానో ఆకర్షితులైనారు. సుందర్‌సింగ్ ఏకాంతంగా ఉండటాన్నే కోరేవాడు. తన ఏకాంతాన్ని ఆయన భద్రంగా కాపాడుకున్నాడు. రోజుకు రెండు మారులు మాత్రమే ప్రసంగిస్తూ, దీర్ఘకాలం ప్రార్థనలోను, దేవునితో సహవాసం చేయడంలోను గడిపాడు.

సుందర్‌సింగ్ కాకినాడలో కూటాల్లో ప్రసంగించడానికి వచ్చాడు. ఆ దినాలలో సుందర్‌సింగ్ గారి స్వహస్తాలతో సంతకం చేయించుకోవాలని ఎంతోమంది ఎగబడుచుండేవారు. ఆయనను చూడాలని మరెంతో మంది గుమిగూడుచుండేవారు. అయితే యౌవనుడైన దానియేలు ఈలాంటివాడు కాదని సుందర్ సింగ్‌కు తర్జుమా చేసే వ్యక్తి ఆయనతో చెప్పాడు. అందువలన తనతో సన్నిహితంగా ఉండడానికి, దానియేలుకు అనుమతి నిచ్చి ఆ తరువాత విశాఖపట్నంలో జరుగబోయే కూటాలకు తనతో వచ్చి ఉండమని ఆహ్వానించాడు సుందర్. సుందర్ సింగ్ గారితో కలిసి ఉండడమే గొప్ప విద్య. సుందర్‌సింగ్ ఎంతో పరిశుభ్రంగా ఉండేవాడు. అర్ధరాత్రి వేళ లేచి తన కాషాయ వస్త్రములను ఉదుకుకునేవాడు. ఈ లోకసంబంధమైన సంపాద్యములేవీ సుందర్‌కి ఉండలేదు. ఆయనకి ఉన్న ఆస్థంతా ఓ బైబిల్, చిన్నదుప్పటి మాత్రమే. ఎవరెంత బలవంతం చేసినా వీటికి మించి ఓ చిన్న భోజన పొట్లం కూడా తన వెంట తీసుకు వెళ్ళేవాడు కాదు. సుందర్ సింగ్ గారి జీవితములోని ఈ సుగుణాలు దానియేలు గారి జీవితముపై చెరగని ముద్ర వేశాయి. ఆయన కూడా ఎంతో పొదుపైన సామాన్య జీవితమును జీవించనారంభించాడు. క్రీస్తును పోలి జీవించాలనే ఆయన తృష్ణకు ఇది ఎంతో సహాయం చేసింది. సుందర్ సింగ్ గారితో గడుపుచూ సన్నిహితంగా ఆయనను గమనించే అవకాశం కలిగిన ఈ దినములు ఎంతో త్వరగా ముగిసిపోయాయి. విశాఖ పట్నములో సుందర్‌సింగ్ గారి కూటములైన తరువాత విద్యాభ్యాసము కొనసాగించవలసి వచ్చినందునను, ఆర్థిక అవసరత వలనను దానియేలు గారు వెనక్కి తిరిగి వచ్చేశారు. కోస్తా, ఆంధ్రా పట్టణములలో అనేకమంది సుందర్‌సింగ్ గారి ప్రసంగాలను విన్నారు. పరలోకమే తమ మధ్య

ఉన్నదన్నట్లుగా భావించి ఆ అద్భుత దినములు గడిచి ఎనభైయేండ్లై పోయింది. ప్రస్తుతానికి ఆ ఉద్రేకము నిలిచియున్న దాఖలాలు ఎక్కడ కనబడవు. ఆ దినములలో అనేకమంది యేసుప్రభువుకు తమ్మును తాము సమర్పించుకున్నారు. అయితే వారిలో అనేకమంది జీవితములలో నాటి ప్రకాశము, పరవశము ఎంతో త్వరగా మాయమైపోయాయి.

సుందర్‌సింగ్ గారి ప్రార్థన జీవితము, క్రీస్తును పోలిన ఆయన నడవడి దానియేలు గారి మీద ఎంతో గొప్ప ప్రభావమును చూపాయి. పైనున్న వాటి కొరకై లోతైన ఆశలు, దేవునితో సన్నిహితముగా నడవాలనే కోరిక ఆయనలో స్థిరంగా నాటుకుపోయాయి. సుందర్‌సింగ్ గారి దగ్గర నుండి సెలవు తీసుకునే సమయములో దానియేలు పైనున్న ప్రేమ కొద్దీ, ఆయనకో శాలువను బహుకరించాడు సుందర్. ఆ గొంగళితో దానియేలు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆయన అన్నగారికి న్యుమోనియా తిరగబెట్టడంతో చావు బ్రతుకుల మధ్య ఉండినాడు. ఆ దినములలో ఊపిరితిత్తుల వ్యాధులకు తగిన మందులు లేకపోవడం వలన డాక్టర్లు కూడా చేతులెత్తేశారు. ఇంటి వారందరూ తమ కళ్ళ ముందే ఆయన మరణించడాన్ని చూడలేక వరండాలో కూర్చుని ఏడ్చుచుండినారు. ఇలాంటి పరిస్థితులలో విశ్వాసములో నూతనోత్తేజంతో ఉన్న దానియేలు లోనికి వెళ్ళి సుందర్‌సింగ్ గారిచ్చిన గొంగళిని అన్నగారి మీద కప్పి, అక్కడే మోకరించి ప్రార్థించాడు. దీనితో ఆయన ఆశ్చర్యకరంగా కోలుకున్నాడు. దీనిని చూచిన ప్రజలు పరిశుద్ధుడైన పౌలుగారి నడికట్టుగాని, వస్త్రములు గాని తగిలిన రోగులు, స్వస్థత పొందిన రీతిగ, చనిపోవుచున్నవారిని బ్రతికించుటకై సుందర్‌సింగ్ గారి గొంగళిని దేవుడు వాడుకుంటున్నాడని గమనించారు. సుందర్‌సింగ్ గారి క్రీస్తుని మాత్రం దానియేలుగారు గట్టిగా హత్తుకున్నారు. అద్భుతమైన ఈ స్వస్థతకై సమస్త మహిమను ఆయనకే చెల్లించారు.

– సేకరించబడింది

(ఇంకా ఉంది)

**ముఖ్య గమనిక:**

మీ ప్రార్థనావసరతలకై ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.00 గం॥ల నుండి సాయంత్రం 6.00 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

 అబద్ధం చెప్పటం శాపం లాంటిది. ఎందుకంటే అది మనలో తప్పించుకునే దోరణిని పెంచుతుంది.



# ఆల్ ది బెస్ట్

హాయ్ పిల్లలూ! ఎలా ఉన్నారు? చాలా టెన్షన్ గా కనబడుతున్నారు? ఎగ్జామ్స్ అనా! Ooh! ఎంత టెన్షన్ !! సర్లే నేను మిమ్మల్ని డిస్టర్బ్ చేయను. మీ పేరెంట్స్ కి చెబుతాను మిమ్మల్ని బాగా చూసుకోమని, కోప్పడవద్దని ok నా !

హలో పేరెంట్స్ ఎలా ఉన్నారు? పిల్లల్ని చదవమని బాగా స్ట్రిక్ట్ చేస్తున్నారా? క్రమంగా చదువుకునే వారికి ఈ టైం కూల్ గానే ఉంటుంది. ఏవరేజ్ స్టూడెంట్స్ చాలా టెన్షన్ పడిపోతారు, టైం లేదని తెగ కుస్తీ పడతారు. నిద్రపోకుండా మరీ చదువుతారు. కావున మీరే పిల్లలకి అర్థమయ్యేలా చెప్పాలి, మంచి ఫుడ్ పెట్టాలి. టైంకి నిద్రపోయేలా చూడాలి.

పిల్లలు తల్లితండ్రుల ప్రతిరూపాలు. మన నడత, నడక అన్నింటిని పిల్లలు అనుకరిస్తారు.

మెకానిక్ కుటుంబం నుండి వచ్చిన ఒక తల్లి, వంట పాత్రల నుంచి పిల్లల ఆట వస్తువుల వరకూ తన బుద్ధిని ఉపయోగించి ఏదో ఒక బొమ్మ తయారు చేస్తూ ఉండేది. దాంతో పిల్లలకు కూడా ఏ పని అయినా సొంతంగా చేయాలనే దృక్పథం ఏర్పడింది. ఇక తండ్రి పిల్లలతో కలిసి ఒకరోజు లాన్‌లో ఆటలాడుకుంటుండగా పొరుగింటి యజమాని..... "లాన్ అలా తొక్కేస్తున్నారు లాన్ పాడైపోతుంది జాగ్రత్త" అని హెచ్చరించాడు. "నేను పిల్లల్ని పెంచుతున్నాను కానీ, గడ్డిని కాదని సమాధానమిచ్చాడు ఆ తండ్రి". పిల్లలకు ఆట వస్తువులు ఇచ్చి, వాటితో వారికి నచ్చినట్లు ఆడుకోనీయని మనలో ఎంతో మంది ఈ తండ్రి నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మనమూ పిల్లలకు ఆటబొమ్మలు తెస్తాం. అయితే పిల్లలు వాటిని ఊడదీయబోయినా, వారికి నచ్చినట్టు చేయబోయినా వెంటనే అడ్డుకుంటాం. మరి వారి ఊహా శక్తి ఎలా పెరుగుతుంది?

ఒకరోజు తల్లి చిన్న పుల్లలు, రబ్బర్ బ్యాండ్‌లను ఉపయోగించి నేలమీద నుంచి పైగి ఎగిరే హెలికాప్టర్ లాంటి ఆట బొమ్మను తయారుచేసింది. పిల్లలు కూడా అలాంటి బొమ్మలు మరో 20 తయారు చేశారు. పైకి ఎగరగలిగిన బొమ్మ కింద పడకుండా ఎందుకు

ఉండలేకపోతుంది? ఈ ప్రశ్న ఆ చిన్న బుర్రలను తొలిచేసినా సమాధానం వెంటనే దొరకలేదు. స్కూల్లో కూడా అదే బొమ్మపై ప్రయోగాలు చేస్తూ టీచర్లతో ఆ పిల్లలిద్దరూ చివాట్లు తిన్న రోజులెన్నో? ఎగిరిన దానిని గాలిలో ఉంచటమెలా? అన్న ప్రశ్న వారిని తొలుస్తూనే ఉంది. మానవ మెదడుకు కొత్త ఆలోచన ఏదైనా స్పృశిస్తే ఆ తరంగాలు ఏళ్ళపాటు అలాగే ఉంటాయంటారు. కొన్నేళ్లు గడిచాయి. తరువాత ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా గాలిలోనే ఎగిరి 57 సెకన్లపాటు ఆకాశంలో ఉండగలిగారు. ఆ పిల్లలే..... ప్రపంచమంతా ముద్దుగా పిలుచుకునే రైట్ సోదరులు (ఆర్‌విల్ రైట్, విల్‌బర్ రైట్) వారి ఉత్సాహపూరిత ఊహల మేధోమథననుంచి వచ్చిందే "విమానం".

పై ఉదాహరణలో కనిపించే అంశం ఒక్కటే...పిల్లలు బోధన, దండన కంటే పెద్దల్ని అనుకరించడం ద్వారా సంస్కారాన్ని, మంచి వ్యక్తిత్వాన్ని నేర్చుకుంటారు. ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో గురువులు, ఇంటికి వచ్చే బంధుమిత్రులు. వీరందర్నీ ప్రతి కదలికనూ పిల్లలు ఆసక్తిగా గమనిస్తుంటారు.

ఆలోచించండి మీ పిల్లల భవిష్యత్తు మీ చేతిలోనే ఉంది. వారిని సమాజానికి, దేవునికి ఉపయోగపడేలా చిన్ననాటి నుంచే తీర్చిదిద్దే ఎగ్జామ్ మీకుంది బి రెడి ఆల్ ది బెస్ట్...

పిల్లలూ! అందరూ రైట్ సోదరులంత అత్యున్నత స్థితికి కాకపోయినా తమ స్థాయిని, ఆసక్తిని బట్టి ముందుకు వెళతారు. మీ తల్లిదండ్రుల మాట విని మీకు నచ్చిన అంశాలు మీరే ఎంచుకునే ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని ప్రోత్సహిస్తున్నాను, తెలియని వాటిని ఇంట్లో, సండే స్కూల్ లో ఇంకా మీ టీచర్స్ ని బంధుమిత్రులని అడిగి తెలుసుకోవాలి. మీ ఇంట్రెస్ట్ దేనిమీద ఉంటుందో గమనించుకుని ఆ దిశగా మీ కెరీర్ ప్రారంభించండి. మీకు ఆసక్తిని కలిగించే వాటిని గురించి మీ పేరెంట్స్ తో Discuss చేయండి. వారి ప్రోత్సాహం ఎప్పుడూ మీకు ఉంటుంది.

చివరిగా ఒక్క విషయం. మనము ఏది చేయాలన్నా ఏం అవ్వాలన్నా దేవుని సహాయం, blessings Important. కాబట్టి లేవగానే ప్రేయర్ చేసుకుని మీ Thoughts అన్నీ యేసయ్యకు చెప్పి హెల్ప్ కోసం అడగండి. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. Confidence పెరుగుతుంది, ఎగ్జామ్స్ బాగా వ్రాస్తాను అనే ధైర్యంతో ఎగ్జామ్ హాల్ కు వెళ్ళండి, Take care పిల్లలూ! బాగా ప్రిపేర్ అవ్వండి. టైం వేస్ట్ చేసుకోవద్దు. Best of luck......

# “నా జీవితములో దేవుని మేలులు”

**శారా, కేశనపల్లి**

నా పేరు శారా, తూర్పుగోదావరి జిల్లా, కేశనపల్లి. మాది భయంకరమైన విగ్రహారాధన కుటుంబము, నేను మా తల్లిదండ్రులకు ఒక్క కుమార్తెను, నాకు ఇద్దరు తమ్ముళ్ళు క్రైస్తవులంటే అస్సలు ఇష్టపడేదానిని కాదు. అలాగని విగ్రహారాధన కూడా ఇష్టంగా ఏమీ చేసేదానిని కాదు. నా తల్లిదండ్రులు నన్ను చాలా గారాబంగా పెంచి, చిన్నవయస్సులోనే వివాహం చేశారు, వెంటనే ముగ్గురు పిల్లలు పుట్టారు. నా భర్త పేకాట, త్రాగుడు, వ్యభిచారం అన్ని అలవాట్లకు బానిసైపోయి ఆస్థి అంతా నష్టపరిచి, నన్ను పిల్లల్ని ఏమీ పట్టించుకోకుండా మూడురోజుల వరకు ఇంటికి రాకుండా ఉండేవాడు. నా పిల్లల్ని కూడా నా తల్లే పెంచుతూ ఉండేది. సడెన్‌గా మా అమ్మ చనిపోయింది. పిల్లలు ఏడుస్తుంటే నాకు ఏం చెయ్యాలో తెలియక వాళ్ళతో పాటుగా నేను కూడా మా అమ్మ వస్తుంది అని అమ్మకోసం ఏడ్చేదాన్ని. ఏం చేయాలో తెలిసేది కాదు. అందరూ ఉండి కూడా ఎవరూ లేనిదాని నయ్యాను. ఎవ్వరూ ఏ సహాయం చేసేవారు కాదు. పరిస్థితులను బట్టి పిల్లల్ని పెట్టుకొని రాత్రి పగలు ఏడుస్తూ అనేకసార్లు చనిపోవాలనుకున్నాను. ఇలాంటి సమయములో ఒక సహోదరి ఎందుకు ఎప్పుడూ అలా ఏడుస్తూ ఉంటావు? యేసుప్రభువు నీకు తోడుగా ఉండి సహాయం చేసి పరిస్థితులను మారుస్తాడు అని నా తల్లిలా ఆదరించి, ధైర్యపరిచి చర్చికి తీసుకొని వెళ్ళింది. మా ఊరిలో ఆడవాళ్ళు వీధిగుమ్మముల్లో, బయట కనపడితే తప్పుగా ఉండేది. అందుకే ఎవరూ చూడకుండా చర్చికి వెళ్తూ ఉండేదానిని. అయిననూ పరిస్థితులలో ఏ మార్పు కలగలేదు. దేవున్ని నమ్ముకున్నావు, ఏం చేస్తున్నాడు నీ దేవుడు అని అందరూ తిట్టేవారు. పరిస్థితులు మారకపోవడంతో అందరూ తిడుతూ ఉండడంతో, నిజమే గదా ఏమీ మారట్లేదు అనే శరీరసంబంధమైన ఆలోచనలలోకి వెళ్ళి, అవిశ్వాసముతో కృంగిపోయేదానిని. ఈ విధమైన ఆలోచన కొద్ది గంటలు కలిగిననూ, వెంటనే నా దేవుడు నాకు మేలు చేస్తారు నన్ను విడువడు అని దేవునిని విడిచిపెట్టకుండా, ఆయనలోనే నిలిచి ఉండాలి అనే మనస్సు కలిగేది. నా తండ్రి కూడా నా బిడ్డ ఇలా తయారయ్యిందేమిటి? అని నేను దేవునిని నమ్ముకున్నానని బాధపడుతూ ఉండేవాడు. అయినా దేవుని విషయములో ఎవ్వరికీ భయపడకుండా ముందుకి సాగుతూ ఉండాలని నిర్ణయించుకొని 1998 వ సం॥లో రక్షణ పొందాను.

నేను రక్షణ పొందిన తరువాత మా ఇంటి వద్దనే సేవకులు వచ్చి ప్రతివారం వాక్యం చెప్పేవారు. కానీ ఆత్మానుసారంగా కాక ఆచారపదంగా ఉండేది. నేను కూడా ఆచారపూర్వకమైన భక్తిని చేసేదానిని. అనేకమంది మా ఇంటికి వచ్చి, వాక్యం విని

రక్షించబడ్డారు. నా భర్త వ్యసనముల కారణంగా నా కుమారుడు ఎలా తయారవుతాడోనని హాస్టల్‌లో పెట్టి చదివించాము. కొన్ని చీకటి శక్తులు పట్టి పీడిస్తున్నప్పుడు ప్రార్థన ద్వారా ఆ చీకటిశక్తుల నుండి విడిపించబడి, యౌవనకాలములో రక్షింపబడి జాబ్ చేసుకుంటూ దేవుని పరిచర్యలో వాడబడుతున్నాడు. అలాగే నా పెద్ద కుమార్తె వాణిని బట్టి మేము హైదరాబాద్‌కు రావడం జరిగింది. మన పరిచర్య మొదట్లో కొద్దిమంది ఉన్నప్పుడు మా వాణి ఆరాధనలకు వచ్చి వాక్యం విని, ఆత్మీయంగా బలపడుతూ, దేవునిలో విశ్వాసముతో ఉండేది. మేము ఇక్కడికి వచ్చిన తరువాత ఆమె జీవితములో కలిగిన సమస్యలను బట్టి అధైర్యపడి, ఏ మాత్రం ప్రశాంతత లేకుండా బ్రతికేవాళ్ళము.“ఇంత మంచి ఆత్మీయమైన పరిచర్యలో దేవుడు మనలను ఉంచారు? ఇది మన ధన్యత ఎందుకు మమ్మీ బాధపడతావు? అని వాణి ఎంతో ధైర్యం చెప్పేది.దేవునిలో ఆసక్తితో ఉండేది, అటు తరువాత కొంత కాలమునకు వాణి మరణించి, దేవుని సన్నిదికి చేర్చబడింది.

ఒకప్పుడు పరిస్థితులు మారట్లేదు అని అవిశ్వాసములోకి వెళ్ళిన నేను, నా జీవితములో దేవుని ఉద్దేశ్య ప్రకారమే సమస్త పరిస్థితులను జరిగించారు అనే నిజమైన విశ్వాసము లోనికి నడిపించబడ్డాను. అంతేకాక ప్రతి పరిస్థితిని బట్టి సంతృప్తితో, సంతోషంగా ఉండే కృపను చూపారు. ఇది అంతయు మన పరిచర్యలోని దైవసేవకుల వాక్యముల ద్వారా మాత్రమే జరిగింది. అందును బట్టి దేవునికి కృతజ్ఞతలు చెల్లించుచున్నాను. ఇప్పటికి నేను దేవుని నమ్ముకొని 37సం11లు, మేము ఇక్కడికి వచ్చి 12సం11లు. ఇక్కడికి రాకముందు ఆచారపు అలవాట్లతో కూడిన భక్తితోనూ, ఎవ్వరినీ క్షమించలేని మనస్సుతో, సహనము లేని స్థితిలో ఉన్న నాకు, మన పరిచర్యకి వచ్చిన తరువాత అనేక విషయములలో మార్పుని కలుగజేశారు.

నా రక్తసంబంధీకులు అనేకమంది రక్షింపబడ్డారు. నా భర్తలో కూడా చాలా మార్పు వచ్చింది. ఇంకా రక్షణ పొందలేదు. మా కొరకు ప్రార్థించగలరు. నా పట్ల ఆయన చేస్తున్న కార్యములు, ప్రతి నిమిషం ఆయన చూపిస్తున్న ఆదరణ, నేను పొందే ఆనందం ఎంత చెప్పిననూ సరిపోదు. చిన్న సమస్యని కూడా భరించలేని నాకు ప్రతి పరిస్థితులలోనూ నా ప్రక్కనే ఉండి, సహాయం చేయుచూ నన్ను నడిపిస్తున్న నా తండ్రి యొక్క ఉన్నతమైన ఉద్దేశ్యములు మాత్రమే నా జీవితములో నెరవేర్చబడాలి, నా చివరి శ్వాస వరకు దేవునిలోనే నిలిచి ఉండాలని నా తపన.

# పవిత్ర రక్తము ద్వారా...

మనం పాపక్షమాపణ పొందడానికి, దైవ సన్నిధిలో ప్రవేశించడానికి, సిలువపై యేసుక్రీస్తు చిందించిన రక్తమే కారణం.

“రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదనియు చెప్పవచ్చును” **మరియు ధర్మశాస్త్ర ప్రకారము సమస్త వస్తువులును రక్తము చేత శుద్ధిచేయబడుననియు, రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును. – హెబ్రీ 9:22**

**క్రీస్తు రక్తము వలన మనకు కలిగిన మేలులు:–**

హృదయ పవిత్రత : ఆయన వెలుగులో ఉన్న ప్రకారము మనమును వెలుగులో నడచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును. (1 యోహాను 1:7)

నిత్యజీవము : కావున యేసు ఇట్లనెను – మీరు మనుష్య కుమారుని శరీరము తిని ఆయన రక్తము త్రాగితేనే కాని, మీలో మీరు జీవము గలవారు కారు. “నా శరీరము తిని నా రక్తము త్రాగువాడే నిత్యజీవము గలవాడు; అంత్యదినమున నేను వానిని లేపుదును” (యోహాను 6:53,54)

దేవుణ్ణి సమీపించడం: అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు. (ఎఫెసీ 2:13)

సిలువపై మరణించిన తరువాత యేసు సమాధిలో మూడు దినములున్నాడు. **యోనా మూడు రాత్రింబగళ్లు తిమింగలము కడుపులో ఏలాగుండెనో ఆలాగు మనుష్య కుమారుడు మూడు రాత్రింబగళ్లు భూగర్భములో ఉండును. – మత్తయి 12:40** తరువాత దేవుడు తన కుమారుడిని మరణం నుండి లేపాడు. **మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను. – రోమా 1:4**

దేవుడు క్రీస్తుతో మనలను కూడా లేపాడు. యేసు మరణం మన కొరకు అలాగే ఆయన పునరుత్థానం కూడా మనకొరకే ! **మీ అపరాధములచేతను పాపములచేతను మీరు**

చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను. మీరు వాటిని చేయుచు, వాయుమండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి, యీ ప్రపంచ ధర్మముచొప్పున మునుపు నడుచుకొంటిరి. వారితో కలిసి మనమందరమును శరీరముయొక్కయు మనస్సుయొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు, మన శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించుచు, కడమ వారివలెనే స్వభావసిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమై యుంటిమి. అయినను దేవుడు కరుణాసంపన్నుడై యుండి, మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతోకూడ బ్రదికించెను. కృప చేత మీరు రక్షింపబడియున్నారు. క్రీస్తుయేసునందు ఆయన మనకు చేసిన ఉపకారముద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచునిమిత్తము, క్రీస్తుయేసునందు మనలను ఆయనతోకూడ లేపి, పరలోకమందు ఆయనతోకూడ కూర్చుండబెట్టెను. - ఎఫెసీ 2 :1-6

మనకు నూతన జీవమును, నూతన ప్రారంభమును అనుగ్రహించుటకు, మన క్రియలను బట్టి కాక, తన స్వకీయ సంకల్పమును బట్టియు, అనాది కాలముననే క్రీస్తు యేసునందు మనకు అనుగ్రహింపబడినదియు, క్రీస్తుయేసను మన రక్షకుని ప్రత్యక్షతవలన బయలుపరచబడినదియునైన తన కృపనుబట్టియు, మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. ఆ క్రీస్తుయేసు, మరణమును నిరర్థకము చేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను. - 2 తిమోతి 1:9,10 కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్త వాయెను; - 2 కొరింథీ 5:17

మనకు సాతానుపై విజయమును, అధికారమును, శక్తిని అనుగ్రహించుటకు ఆయన పునరుత్థానుడయ్యాడు.

దేవుని రాజ్యములో మనలను తన కుమారులుగాను, వారసునిగాను చేయడానికి ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదుగాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము - అబ్బా తండ్రీ అని మొఱ్ఱ పెట్టుచున్నాము. మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతో కూడ మహిమపొందుటకు ఆయనతో శ్రమపడినయెడల, క్రీస్తుతోడి వారసులము. - రోమా 8:15-17

మన జీవితంలో ప్రతి అక్కరనూ పునరుత్థానం తీరుస్తుంది. మన ప్రాచీన పాప స్వభావం యేసుక్రీస్తుతో సిలువ వేయబడి ఆయనతో పాటు సమాధి చేయబడింది. యేసు సజీవుడిగా తిరిగి లేచినప్పుడు మన పాత జీవితమును ఆ సమాధిలో విడిచిపెట్టి, మనము

ఆయనతో నూతన సృష్టిగా లేచాము. గతం నుండి విడుదలను కలిగిస్తుంది, ప్రస్తుతం శక్తితో నింపుతుంది, భవిష్యత్తు కొరకు నిరీక్షణను కలుగజేస్తుంది. యేసు జీవిస్తున్నాడు గనుక ఇప్పుడు పాపముపై సాతాను దాడులన్నింటిపై విజయవంతమైన జీవితం జీవించడానికి మనం ఆయన ఆత్మ శక్తిని పొందాము.

యేసు పునరుత్థానం భవిష్యత్తుకు గొప్ప నిరీక్షణ నిస్తుంది. "మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" (కొలస్సీ 1:18) ఆయనను వెంబడించడానికి, ఆయనలో విశ్వాసముంచే వారికందరికి మరణములో నుండి తిరిగి లేవడానికి ఆయన పునరుత్థానం ఒక మార్గమును ఏర్పరచింది.

రాబోయే కాలములో ఒక మంచిదినమున యేసుక్రీస్తు ఈ భూమికి తిరిగి వస్తాడు. అయితే ఈసారి పసిపాపలా కాదు. సర్వప్రపంచమునకు తన నిజస్వరూపమును ప్రత్యక్షపరుచుకుంటూ మహిమకరమైన దేవునిగా, సృష్టికంతటికి పాలకునిగా తిరిగి వస్తాడు. ఆ సమయములో ఆయనలో విశ్వాసముంచి మరణించినవారంతా తిరిగి జీవముతో లేస్తారు.

**క్రీస్తు లేపబడనియెడల మీ విశ్వాసము వ్యర్థమే, మీరింకను మీ పాపములలోనే యున్నారు. అంతేకాదు, క్రీస్తునందు నిద్రించిన వారును నశించిరి. ఈ జీవితకాలముమట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైనయెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుము. ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు; - 1 కొరింథీ 15:17-22**

**సహోదరులారా, నేను చెప్పునది ఏమనగా రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొన నేరవు; క్షయత అక్షయతను స్వతంత్రించుకొనదు. ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మనమందరము నిద్రించము గాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనము మార్పు పొందుదుము. క్షయమైన యీ శరీరము అక్షయతను ధరించుకొనవలసియున్నది; మర్త్యమైన యీ శరీరము అమర్త్యతను ధరించుకొనవలసియున్నది. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు, విజయమందు మరణము మ్రింగివేయబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును. - 1 కొరింథీ 15:50-54**

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

మనము చేయగలిగిన అత్యంత శక్తివంతమైన ప్రార్థనలలో ఒకటి శత్రువులను గురించి ప్రార్థించుట. మనలను బాధపెట్టిన వారి కొరకు, మోసపరచిన వారి కొరకు విజ్ఞాపన చేసినప్పుడు దేవుడు అత్యధికముగా ఆశీర్వదిస్తారు.

యోబుని మనం జ్ఞాపకం చేసుకుంటే, తనను బాధపరిచి నిరుత్సాహపరచిన తన స్నేహితుల కొరకు అతను ప్రార్థించవలసి వచ్చింది. కాని, అలా ప్రార్థించిన వెంటనే అతని జీవితం ఆశీర్వదించబడింది. నిజానికి, అతను పోగొట్టుకున్నదాని కంటే దేవుడతనికి రెండింతలు ఎక్కువ ఇచ్చాడు. **మరియు యోబు తన స్నేహితుల నిమిత్తము ప్రార్థన చేసినప్పుడు యెహోవా అతని క్షేమస్థితిని మరల అతనికి దయచేసెను. మరియు యోబునకు పూర్వము కలిగిన దానికంటె రెండంతలు అధికముగా యెహోవా అతనికి దయచేసెను. - యోబు 42:10**

మనలను బాధపెట్టిన వారి కొరకు ప్రార్థించుట అనేది చాలా శక్తివంతమైనది. ఎందుకనగా అలా చేసినప్పుడు మనం ఆ వ్యక్తి యెడల ప్రేమలో నడుస్తూ దేవుని వాక్య ప్రకారం నడుస్తున్నామని అర్థం. **నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులైయుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి.** అని దేవుడు చెప్పుచున్నాడు. మనలను ఉపయోగించుకొని తరువాత మనలను దూషించిన వారి గురించి, బాధపెట్టిన వారి గురించి, హింసించిన వారి గురించి, చెడుగా మాట్లాడిన వారి గురించి మనం ఆలోచిస్తున్నప్పుడు వారిని శపించక, దీవించాలి వారి కొరకు ప్రార్థించాలి. శత్రువులను దీవించుట సులభము కాదని, అది చేయుటకు మనం ఇష్టపడమని దేవునికి తెలుసు. కాని మనకి ఇష్టం కాబట్టి మనం దీనిని చేయుట లేదు. దేవుని కొరకు దీనిని చేస్తున్నాము. శపించుటకు బదులుగా ప్రార్థించుటకు, దీవించుటకు ఎంచుకొనుట అనేది ఆత్మీయతలో శక్తివంతమైనది మరియు దాని ఫలితంగా దేవుడు మన జీవితములో గొప్ప విషయములను జరిగిస్తాడు. కనుక మనలను ద్వేషించినవారి కొరకు, శత్రువుల కొరకు ప్రార్థించాలి. ఐక్యతతోను, ఏకీభవించి చేసే ప్రార్థన ఎంతో శక్తివంతమైనది.

మనము ఒకదాని గురించి ప్రార్థిస్తూ, అందులో ఏ అభివృద్ధి చూడకపోయినట్లయితే, మనతో కలసి ప్రార్థించుటకు మనకు ఒకరు కావలసియున్నది. ఇటువంటి ఐక్యతలో శక్తివంతమైన ఆత్మీయ బలమై యున్నది, **సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము!** కీర్తనలు 133 ప్రకారం ఇది మంచిదియు, దేవుని ఆశీర్వాదములను తెస్తుంది. మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనిని

గూర్చియైనను భూమి మీద ఏకీభవించిన యెడల అది పరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరుకునని మీతో చెప్పుచున్నాను. **మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనినిగూర్చియైనను భూమిమీద ఏకీభవించినయెడల అది పరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరకునని మీతో చెప్పుచున్నాను. ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యను ఉందునని చెప్పెను. - మత్తయి 18:19-20**
వ్యక్తిగతముగా కూడా దేవుడు మన మధ్య ఉన్నాడు. కాని మనం కలసి, ఐక్యతతో దేవుని వద్దకు వచ్చినప్పుడు మన శక్తి అభివృద్ధి చెందుతుంది. ఒకడు వేయిమందిని తరుమును, ఇద్దరు పదివేలమందిని పారదోలుదురు అని బైబిలు చెప్తుంది. (ద్వితీ 32:30)

మనుష్యులను విడదీయుటకు, మానవ సంబంధములలో కలహములు పుట్టించుటకు, కోపమును, రోషమును పెంచుటకును, మనుష్యులు ఒకరిని ఒకరు ద్వేషించుటకు సాతాను శ్రద్ధగా పని చేస్తాడు. కానీ దేవుని ఆశీర్వాదము ఐక్యతలోను, ఆయన సన్నిధి, ఆయన నామమున ఏకీభవించిన వారి మధ్యలోను ఉంటుంది గనుక ఐక్యత యొక్క శక్తిని మనం అర్థం చేసుకొనవలసి ఉన్నది.

దేవునితో వ్యక్తిగత సమయములు, సన్నిహిత సంభాషణలు అవసరమై యున్నప్పటికీ ఒకరితో ఒకరు కలిసి ప్రార్థించుటలోని శక్తిని కూడా మనము నేర్చుకొనవలసియున్నది. ఐక్యతతో జీవించుట అనగా సొంత అభిప్రాయములు ఉండకూడదని కాదు కానీ మన సంబంధములలో మృదుత్వం, ఒకరి పట్ల ఒకరికి మర్యాద, గౌరవం ఉండాలని అర్థం. మనము ఎవరితోనైనా ఏ ప్రార్థనా గుంపుతోనైనా కలసి ప్రార్థిస్తున్నప్పుడు మహా ఆత్మీయత కలిగిన వారముగా కనిపించుటకు ప్రయత్నించకుండా జాగ్రత్తపడాలి. ఏకీభవించుట అనేది అసామాన్యమైన శక్తి కలిగినది కాని అది పవిత్రంగాను, తగ్గింపు కలిగినదిగానూ ఉండాలి. ఏకీభవించుట యొక్క శక్తి ఎంత శక్తివంతమైనదంటే ఒక గొప్ప మలుపు మన జీవితములో కలుగుతుంది. ఐక్యత దేవుని ఆశీర్వాదమును తెస్తుంది. కనుక ఆత్మీయ జీవితములో నిజంగా ఏకీభవించి చేసే ప్రార్థన అత్యంత శక్తివంతమైనది.

–సేకరించబడినది, ఇంకా ఉంది
జాయిస్‌మేయర్

# బహుమానం (Gift)



చక్కగా చదువుకునే తన కుమారుణ్ణి చూసుకొని ధనవంతుడైన తండ్రి చాలా సంతోషించాడు. కాలేజీలో తన కుమారుడు వేదిక పైకి వెళ్ళి బంగారు పతకం తీసుకుంటూ వుంటే ఆ తండ్రి కళ్ళల్లో నుండి ఆనందభాష్పాలు వచ్చాయి. కాలేజీలో బహుమతి ప్రదానం అయిన తర్వాత తండ్రి కుమారులిద్దరు కలసి కారులో ఇంటికి వస్తుండగా ఆ కుమారుడు కారులో నుండి చూస్తున్నప్పుడు తనకు ఎంతో ఇష్టమైన (హీరోహోండా) బైక్ షోరూమ్ అద్దాల్లో నుండి మెరుస్తూ కన్పించింది. వెంటనే వాళ్ళ డాడీకి ఆ బైక్‌ను చూపుతూ డాడీ వచ్చేనెల నా పుట్టిన రోజు కదా నాకు ఆ కన్పిస్తున్న బైక్ బహుమానంగా ఇవ్వవా? అని అడిగాడు. రోజులు గడుస్తున్నాయి, పుట్టినరోజు దగ్గర పడుతోంది కానీ, తండ్రికి బైక్ కొనే ఆలోచన ఉన్నట్లుగా ఆ కుమారునికి కనిపించలేదు.

పుట్టినరోజు రానే వచ్చింది, తండ్రి తన కుమారుని పిలిచి, నువ్వంటే నాకు ప్రాణం కాబట్టి నీకు బహుమానం ఇస్తున్నానని చెబుతూ తన చేతిలో ప్యాక్ చేయబడి వున్న ఒక చిన్న పెట్టెను తన కుమారునికి ఇచ్చాడు. బైక్‌ను బహుమానంగా ఇస్తారని వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్న ఆ కుమారునికి తండ్రి రంగు కాగితాలలో చుట్టి ఇచ్చిన ఆ బహుమానాన్ని అయిష్టంతో తెరిచాడు. అందులో ఎంతో అందమైన "బైబిల్". దానిపై అతని పేరు గోల్డ్ అక్షరాలతో ముద్రించబడి వుంది. తాను కోరుకున్న బైక్‌ను కాకుండా "బైబిల్"ను కానుకగా ఇచ్చినందుకు తనలో వున్న ఉక్రోషాన్ని ఆపుకోలేక నువ్వు ఇంత ఆస్థిపరుడవై యుండి నేనడిగిన బైక్‌ను కాక "బైబిల్"ను ఇస్తావా? అని ఏడుస్తూ, అరుచుకుంటూ ఇంట్లో నుండి వెళ్తుండగా, బాబూ.... నా కుమారుడా! నా మాట విను, ప్లీజ్ వెళ్ళిపోవద్దు అని తండ్రి పిలుస్తున్నా ఆ కుమారుడు వినకుండా వెళ్ళిపోయాడు. కొన్ని దినములు అయిన తర్వాత తండ్రి ఆరోగ్యము క్షీణించింది. తన కుమారుని రాక కొరకు వెయ్యి కళ్ళతో ఎదురుచూసి దుఃఖముతో కన్ను మూసాడు. కొంతకాలమైన తర్వాత తన తండ్రి చనిపోయాడన్న వార్త విని, ఆస్తి అంతా తనకే చెందుతుందని తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంటిలో అడుగు పెట్టగానే తన తండ్రి చూపిన ప్రేమ జ్ఞాపకం వచ్చి తనకు తెలియకుండానే కన్నీరు కార్చాడు. తన తండ్రి తన కొరకు ఇచ్చిన చిట్టచివరి బహుమానమైన బైబిల్‌ను చూడాలని ఆశతో తన గదిలోనికి వెళ్ళాడు.

 విమర్శ వేడినీరులాంటిది.... మొదట చురుక్కుమన్నా, లోపాలు కడిగివేస్తుంది.

బైబిల్ తెరిచినప్పుడు, అతని కంటికి "మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటే ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును" మత్తయి 7:11 అనే వచనము అండర్‌లైన్ చేయబడి వుండెను. అది ఆ కుమారుడు చదువుతుండగా బైక్ తాళపుచెవి ఆ బైబిల్ వెనుక కవరునుండి జారి క్రిందపడెను. ఆ కవరులో తన తండ్రి నాయనా ! నువ్వు ఆశించినట్లుగా ఆరోజు చూపించిన బైక్‌ను కొన్నాను. పూర్తిగా వెల చెల్లించాను. నువ్వు వెళ్ళి ఆ షోరూమ్ నుండి ఆ బైక్ తెచ్చుకో ఇట్లు నీ తండ్రి అని వ్రాయబడివుంది. దానిపై ఆరోజు తారీఖు కూడా వుంది. అది చదువుతూనే ఆ కుమారుడు కూలబడిపోయాడు. డాడీ ! డాడీ !! ఎంతగా నన్ను ప్రేమించావు డాడీ ! నీ ప్రేమను అపార్థం చేసుకొని తొందర పాటుతో నిన్ను విడిచి ఇంతకాలం తిరిగాను. తన తండ్రి చూపిన ప్రేమ జ్ఞాపకమునకు వచ్చి కన్నీరు విడిచాడు.

ప్రియ పాఠకా ! దేవుడు ఎంతో ప్రేమించాడు కాబట్టే నీవు కోరిన కోర్కెల కంటే, నీ ఆకాంక్షల కంటే విలువైన, ఘనమైన ఆయన కుమారుని ప్రాణాన్ని నీ కొరకు అర్పించాడు. కానీ ఉపమానంలో బైకి కావాలని తొందరపడిన ఆ యౌవనుడు చేసిన పొరపాటు నీ జీవితంలో చేయకు. బైకు కంటే విలువైన ఆ బైబిల్‌ను పొందినపుడే ఆ బైకు లభించినట్లుగా, విలువైన ఆ యేసుప్రాణ త్యాగాన్ని గ్రహించి నీ పాపాల విషయమై పశ్చాతాపపడినపుడు నీకు కావల్సినవన్నియు లభిస్తాయి. ఎవరైనా వస్తువులు బహుమానంగా ఇస్తారు కానీ ప్రాణమునే కానుకగా నీ కొరకు అర్పించిన ఆ దేవాది దేవుడు నీకు అవసరమయిన సమస్తమును ఎందుకు అనుగ్రహించడు ? ఇకనైనా నీ పాపనడతను విడిచిపెట్టు. నిన్ను ప్రేమిస్తున్న, నీ హృదయ ద్వారాల వద్ద నిలుచున్న యేసుపై నిర్లక్ష్యధోరణి విడనాడి, ఆ కృపామయుడు అనుగ్రహించబోతున్న బహుమానములను పొందుకో.






# బైబిల్ క్విజ్ -45

(సమూయేలు గ్రంథం నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.

**1.** పక్షిరాజు కంటె వడిగలవారు, సింహములకంటె బలముగలవారు ఎవరు?

**2.** 'నీ ప్రాణమునకు నీవే ఉత్తరవాది' అని ఎవరితో ఎవరు చెప్పారు?

**3.** అడవి లేడియంత తేలికగా పరుగెత్త గలవాడు ఎవరు?

**4.** "పట్టాభిషేకము నొందినవాడనైనను, నేడు నేను బలహీనుడనైతిని" అని చెప్పిందెవరు?

**5.** దావీదు కొరకు ఒక నగరిని కట్టిందెవరు?

**6.** మంచు కాలమున బావిలో దాగియున్న సింహాన్ని చంపిందెవరు?

**7.** తన ఇంటిని చక్కబెట్టుకొని, ఆ తరువాత ఉరి వేసుకొన్నదెవరు?

**8.** దావీదు సేవకులకు సగం గడ్డం గొరిగించి వారిని అవమానపరిచిందెవరు?

**9.** చచ్చినా, బ్రతికినా దావీదుతోనే ఉంటానని దావీదుకు ప్రమాణం చేసిందెవరు?

**10.** ఎవరి ఆలోచనను చెడగొట్టమని దావీదు ప్రార్థించాడు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఏప్రియల్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే 2016 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 44 జవాబులు (సమూయేలు) :**

1. ఎక్రోను 5:10-12
2. సౌలు 11:7
3. దావీదు 22:2
4. యోవేలు, అబీయా 8:2,3
5. సిక్లగు గ్రామం 27:5,6
6. ఎలియాజరు 7:1
7. తిరుగుబాటు 15:23
8. ఆకీషు రాజు 21:13,14
9. బేత్షెమెషువారు 6:19
10. నోబు 22:19

**బైబిల్ క్విజ్ - 44 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

చంటి, షీబా, సుశీల, ఐజాక్ కుమారి, వీణ, సౌజన్య, వి.సౌజన్య, కమల, మల్లిక

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి - ఏప్రిల్

**భాగ్యలత** : రాజేశ్వరి, వసుంధర, శ్రీవిద్య, స్వప్న, ప్రాముఖ్య, కోటేశ్వరి, రత్నాకర్, గోపీనాధ్, జ్యోతి, లత(యేసమ్మ), విక్రమ్‌కుమార్, సుమలత, నాగమణి, విస్మయ్, ఐలయ్య, వినోద్, సుష్మ, రూతు, బ్యూలా, జగన్, మేఘ, సాత్విక, హరీష్ బాబు, రజని, సుహాసిని, హెప్సిబా, కృపారాణి, సిద్ధమ్మ, సువర్ణరత్న, పుష్పావతి, రిష్విన్‌రాజు, కీన్‌అశ్విన్, యోజస్వి, షారోన్, అభినయ, బోయజ్, శ్రీవాణి, వెంకటరమణి, సురేష్, గోపీచంద్, పార్వతి, ఎస్తేరు, అరుణ, కిరణ్, జయశీల, రజిత, ప్రియాంక, నోయాగ్రేస్, నిరీక్షణ్, సాగర్, తేజ, నమ్రత, సుమన్, విజయకుమారి, కృష్ణవేణి, సింధూర, లలితాసాయి, ఎలీషాబాబు, అనూష, సూచన, బాలచందర్, ప్రసన్న, శేషగిరిరావు, అభిషేక్, విశ్వాస్, రాజ్‌ష్, జాన్‌విక్టర్, విజయ, వర్షిణి, శ్రీనివాసరావు, శ్రీదేవి, పద్మ, గోపాల్, రాజు, జీవన్, దీపిక, శ్యామల, పాధ్విక, కెజియా, మధురిమ, వాత్సల్య, పద్మాకర్, ఆషాపర్ణిక, జయ, కృపారావు, కళ, నాగేష్, ప్రియాంక, పద్మ, జిన్నిబాబు, ఏలియా, పుష్పలత, నోవా, శ్రీకాంత్‌రవి, సలోమియ, పద్మ, తిమోతి, మోజెస్, దీపిక, సుజాత, గీత, రాహుల్, గంగేయుడు, సందేశ్, బందేశ్

**చింతల్** : రాజేష్, జాయానంద్, బాలరాజు, రాణి, శ్రీకాంత్, స్నేహ, శాంతిప్రియ, విజయ్, రాధామణి, సూర్యదీపిక, శిరీష, జీవన్‌కుమార్, హేమకుమారి, సురేంద్ర, అనంతరావు, సుధాకర్, మైఖేల్, డేవిడ్, రాజామన్నార్, విజయ, రాజామన్నార్, మోహన్.

**అనాజ్‌పూర్** : ప్రభుదాస్, మరియమ్మ, కరీమున్, ఆనందరావు, ధనలక్ష్మి, శ్రావణి, రూతు, రమేష్‌బాబు, పీటర్, డేవిడ్, పాల్‌రాజ్, స్వాతి, ఆరాధన, కృపావరుణ్,మణెమ్మ.

**ఇ.సి.ఐ.యల్ :** లలితా సాల్మన్

**"స్పర్శ"** అనే మన ద్వైమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



# శుక్రవారము యొక్క ప్రాముఖ్యత

మనము ప్రతి సంవత్సరము యేసుప్రభువుని సిలువ వేసిన రోజుని గుడ్‌ఫ్రైడే అని చెప్పు కుంటూ, ఆచరించుట జరుగుచున్నది. గుడ్‌ఫ్రైడే అనగా మంచి శుక్రవారము. గుడ్‌ఫ్రైడేని పరిశుద్ధ శుక్రవారము, శుభశుక్రవారము, గొప్ప శుక్రవారము అని కూడా పిలుస్తూ ఉంటారు. ఆయనని సిలువ వేసిన ఆ రోజును మంచి శుక్రవారమని ఎందుకు అంటారు? అనే ప్రశ్న అనేకులకు కలుగుతూ ఉంటుంది.

అనాది కాలం నుండి మానవుడు తాను చేసిన ప్రతి పాపములకు, అపరాధములకు బదులుగా పాపపరిహారార్థ బలిగా, అపరాధ పరిహారార్థ బలిగా గొర్రెల యొక్కయు, మేకల యొక్కయు రక్తమును అర్పించి, ఆ పాపములను పరిహరించుకునే వారు. తరువాత మరల పాత జీవితమునే జీవిస్తూ ఉండేవారు. ఈ విధముగా పాపము చేయుట, దేవుని సన్నిధిలో బలులు అర్పించుట, మరల పాపము చేయుట చాలా సాధారణముగా మారిపోయినది.

సృష్టికర్తయైన ఆ దేవాధి దేవుడు దీనిని చూచి, సర్వమానవాళి పాపశిక్ష అంతా కొట్టి వేయ బడుటకు తన కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపనుద్దేశించెను. సర్వ మానవాళి పాపము పోవాలంటే నిర్దోషమైన, నిష్కళంకమైన రక్తము మాత్రమే చిందింపబడాలి.

మంచి శుక్రవారము, శుభశుక్రవారము అని పిలువబడే ఈ గుడ్‌ఫ్రైడే ఇంచుమించుగా 2000 సంవత్సరాల క్రితం ఒక శుక్రవారం దినమున జరిగిన యధార్థ సంఘటన. ఆ దినము యేసుక్రీస్తును కొరడాలతో కొట్టి, సిలువ ఆకారము కలిగిన కొయ్య మీద ఆయన జీవించి ఉండగానే, రెండు చేతులను, కాళ్ళను మేకులతో బంధించారు. ఈ భూమి మీద మనుష్యుడు చేసిన ప్రతి పాపమునకు యేసుక్రీస్తు ద్వారా మాత్రమే క్షమాపణ కలుగును. ఎందువలననగా ఆయన ఒక్కడే సిలువ మీద వ్రేలాడి, రక్తమును చిందించి, ప్రాణమును ఇచ్చిన మంచి కాపరి.

మనము ఏ కులమైనా, మతమైనా, ధనికులమైనా, పేదలమైనా ఈ సిలువ కార్యమును హృదయములో విశ్వసించి, నేను పాపిని ప్రభువా అని నోటితో ఒప్పుకొనుట ద్వారా ఆయన మనలను క్షమించి నీతిమంతులుగా చేస్తారు. తద్వారా కలిగే శాంతి, సంతోష, సమాధానములు చెప్పటానికి శక్యము కానివి. అంతమాత్రమే కాకుండా, సిలువపై ఆయన చేసిన ఈ పుణ్యకార్యమును విశ్వసించి, పాపక్షమాపణ పొందిన ప్రతివారు నరకము నుండి తప్పించబడి, మోక్షములో అనగా పరలోకరాజ్యములో చేర్చబడతారు. అందుకే గుడ్‌ఫ్రైడే శుభశుక్రవార మయ్యింది.

ఈ పత్రిక చదువుతున్న ప్రతి ఒక్కరు గుడ్‌ఫ్రైడే అంటే క్రైస్తవులది మాత్రమే అని తలంచక ఇంత మంచి మార్గములో మనము ఎందుకు నడవకూడదని ఆలోచించి, యేసుప్రభువు మార్గములో నడచుట వలన మీకు దీవెన కలుగును.

**మిమ్ములను, మీ కుటుంబములను దేవుడు ఆశీర్వదించును గాక !**

## 2016, జనవరి 26వ తేదీ ఉపవాసప్రార్థనలో పాల్గొనిన దేవుని ప్రజలు





# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras